

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :168 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శనివారం 24-10-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు : సివి ఆనంద్



హైదరాబాద్: రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు డిజిపి సివి ఆనంద్ తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తుచేస్తూ, రాష్ట్ర పోలీసు విభాగాలు వివిధ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా పనిచేస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఆయన.. మీడియాతో మాట్లాడారు..నక్సల్స్‌ను ఎదుర్కొనేందుకు 1980లలో గ్రేహౌండ్స్ విభాగాన్ని ఏర్పాటు చేశామని తీవ్రవాద కార్యకలాపాలను అరికట్టేందుకు ఆక్టోపస్‌ను ఏర్పాటు చేశామని, ప్రస్తుతం డ్రగ్స్ నియంత్రణ కోసం ఈగల్ ఫోర్స్ పనిచేస్తోందన్నారు. డ్రగ్స్ ముఠాలను పట్టుకునేందుకు అనేక ఆపరేషన్లు నిర్వహించామని, మాదకద్రవ్యాల నియంత్రణకు చేసిన కృషికి కేంద్ర హోంశాఖ నుంచి అవార్డు లభించిందని, రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు కూడా కేంద్రం అవార్డు ఇచ్చిందని డిజిపి వెల్లడించారు. ఇటీవల తెలంగాణ జీరో నక్సల్స్ రాష్ట్రంగా మారిందని, మొత్తం 824 మంది నక్సల్స్ లొంగిపోయారని, 302 ఆయుధాలను అప్పగించారని సివి ఆనంద్ పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో సమర్థవంతంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. పోలీసుల వినియోగంలోని యాప్‌లను టీస్వార్క్ పేరుతో అప్‌డేట్ చేశామని చెప్పారు. మహిళల భద్రతకు ప్రత్యేక విభాగం పనిచేస్తోందని, మహిళల రక్షణ కోసం టీసేఫ్ యాప్‌ను రూపొందించినట్లు డిజిపి సివి ఆనంద్ స్పష్టం చేశారు.

కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేయాలా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు



హైదరాబాద్ : గత ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. అడ్డమైన మాటలు, అడ్డమైన ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఆయన అంబర్‌పేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేయాలా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో కరెంట్ లేక రైతులు గోస పడుతున్నారు. తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ నిండా ముంచిందని మండిపడ్డారు. పరిపాలన చేతకాక ప్రజలకు ఏమీ చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ఎల్‌నినో ప్రభావంపై 10 నెలల ముందే ప్రభుత్వాన్ని అలర్ట్ చేశారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.పక్క రాష్ట్రాలు, దిగువ రాష్ట్రాలు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుని ప్రాజెక్టులను నింపుకున్నాయి.

తెలివిలేని రేవంత్ రెడ్డి..

తెలివిలేని రేవంత్ రెడ్డి మాత్రం ప్రాజెక్టులను నింపలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం పంపులు ప్రారంభిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని, తాను చేసిన అబద్ధాలు ప్రజల ముందు తేలిపోతాయని రేవంత్ రెడ్డి కుట్ర చేశారు. మేడిగడ్డ కూలిపోయిందంటూ తప్పుడు ప్రచారం చేశారు. కాంగ్రెస్ వాళ్లే మేడిగడ్డను కూల్చారన్నారు. రాహుల్ గాంధీని తీసుకొచ్చి మేడిగడ్డ కూలిపోయిందంటూ అబద్ధాలు చెప్పించారన్నారు. కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరని కేటీఆర్ తెలిపారు.

రేవంత్ రెడ్డి దున్నపోతు ఇనిందంటే.. కిషన్ రెడ్డి దూడను కట్టేయమంటారు. కేసీఆర్‌పై విమర్శలు చేసే విషయంలో కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒక్కటవుతాయి. పిచ్చోడి చేతిలో రాయిలా పాలన సాగుతోంది. మరో ఏడాది రేవంత్ రెడ్డి హడావుడి ఉంటుందని, ఆ తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. తెలంగాణలో లూటీ పాలన నడుస్తోంది. తెలంగాణలో తిరిగి కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం. కాంగ్రెస్ చేతుల్లో మోసపోయిన అన్ని వర్గాలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నాయని చెప్పారు.

మోదీ ఏం చేస్తున్నాడో చూస్తానే ఉన్నాం..

తెలంగాణలోనే కాదు మళ్లీ దేశంలో కేసీఆర్ కీలకం కాబోయే రోజులు దగ్గరలో ఉన్నాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ యేతర పార్టీలు దేశంలో కీలకం కాబోతున్నాయి. నాలుగు సంవత్సరాల కింద కేసీఆర్ కాంగ్రెస్, బిజెపియేతర కూటమి అంటే చాలామందికి అర్థం కాలేదు. మోదీ ఏం చేస్తున్నాడో చూస్తానే ఉన్నాం. ఈరోజు ఒకవైపు దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్న బిజెపికి ప్రత్యామ్నాయ ఎజెండా లేని కాంగ్రెస్ చూసిన తర్వాత కెసిఆర్ చెప్పింది వాస్తవం అని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.రాహుల్ గాంధీ ఎంత చేసిన లాభం లేదు. రాహుల్ గాంధీకి ఎన్ని జాకీలు పెట్టిన లేస్తలేదు.దేశంలో కాంగ్రెస్ విఫలమైంది కాబట్టే బిజెపి పార్టీపై సీజేపీ పేరుతో యువతీ యువకులు పోరాటం చేస్తు న్నారని గుర్తు చేశారు. రాజకీయ నాయకులను బిజెపి బెదిరించగలుగుతుంది కానీ యువతరాన్ని కాదు అని అర్థమైంది. బిజెపి గత పది సంవత్సరాలు ఎప్పుడు లేనంత బలహీనంగా తయారయిందన్నారు. కాంగ్రెస్, బిజెపి ఎంపీలు తెలంగాణలో కలిసిపోయి పనిచేస్తున్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేయకుండా కేవలం.. కేసీఆర్, కేటీఆర్ ని తిట్టడమే పనిగా పెట్టుకు న్నారు.

కాంగ్రెస్‌కు వారు బుద్ధి చెప్పడం ఖాయం..

రాష్ట్రంలో ఎంపీటీసీ జడ్పిటిసి కార్పొరేషన్ ఎన్నికలు పెట్టే ధైర్యం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్‌కు లేదని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎన్నికలు పెడితే 2017లో సెంచరీ కొట్టిన తీరుగా బీఆర్ఎస్ కార్పొరేషన్లను గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచి మొదలుకొని ఎన్నికల దాకా కలిసి పనిచేయాలి. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ధన బలాన్ని మాత్రమే నమ్ము కున్నది. విద్యార్థులను నిరుద్యోగులను యువతి యువకులను యూత్ డిక్లరేషన్ పేరుతో దారుణంగా మోసం చేసింది. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వారు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా ఏకం చేయాలి



ఢిల్లీ : సమాజంలో తలెత్తుతున్న రుగ్మతలు, కొత్త సవాళ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలని, విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయాలని, ఆత్మనిర్భరత వైపు పౌరులను ప్రేరేపించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పిలుపునిచ్చారు.

ఇక్కడ జరిగిన చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ, చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ కాదని, అదొక ఆలోచనా విధానమని మోదీ అన్నారు. చిన్మయ అంటే స్వచ్ఛమైన చైతన్యం అని, దీనిని ఒక చిన్మయ ఋషి స్థాపించారని, దశాబ్దాలుగా ఆయన ప్రయాణం దైవిక సంకల్పాలతో నిండి ఉందని తెలిపారు.“గడిచిన దశాబ్దాలలో కాలం మారింది, దేశం ముందు కొత్త సవాళ్లు తలెత్తాయి, కొత్త సామాజిక రుగ్మతలు బయటపడ్డాయి. ఈ రోజు వాటిని పరిష్కరించే బాధ్యత మనందరిపై ఉంది,” అని మోదీ అన్నారు. మనల్ని విభజించాలని చూసే శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయాలి. మన పౌరులలో ఆత్మనిర్భరత పట్ల అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తిని నింపాలి. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత దేశాన్ని సాధించాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరినీ అనుసంధానించాలి. ఈ లక్ష్యాల కోసం మనం మరింత చురుగ్గా వ్యవహరించాలి,” అని ఆయన అన్నారు. భారత సంస్కృతికి దేశమే జన్మస్థలమని, దేశ ఉనికికి అదే పునాది అని ప్రధానమంత్రి అన్నారు.

భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనడానికి ఫలవంతమైన, నిర్మాణాత్మక చర్చలు జరగాలి



హైదరాబాద్:దక్షిణ భారతదేశాన్ని అత్యంత సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు దక్షిణాది రాష్ట్రాలు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అందుకు తెలంగాణ అనుసరిస్తున్న సాంకేతిక మౌలిక సదుపాయాలు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థను పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకోవడానికి సంసిద్ధంగా ఉన్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులసమన్వయ కమిటీ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసింగ్‌లో తెలంగాణ అనుసరిస్తున్న విధానాలను వివరించి నేరరహిత ప్రాంతంగా తీర్చిదిద్దడంలో రాష్ట్రాల మధ్య సమన్వయ అవసరాన్ని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు.“ఆయా రాష్ట్రాలు తమ సొంత వనరులు, ప్రయత్నాలతో మాత్రమే నేరరహిత రాష్ట్రాలుగా మార్చడం సాధ్యం కాదు. అందుకు అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయం ఎంతో అవసరం. అత్యంత కీలకమైన ఇలాంటి అంశాలపై సదస్సులో విస్తృతంగా చర్చించి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి” అని సదస్సును ఉద్దేశించి ముఖ్యమంత్రి కోరారు.“దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దడంతోపాటు, నేరాల రేటును అత్యంత కనిష్ఠ స్థాయికి తగ్గించాల్సిన బాధ్యత అందరిపైన ఉంది. వివిధ రాష్ట్రాల పోలీసు ప్రధాన కార్యాలయాల మధ్య సరిహద్దులు దాటి సమన్వయంతో పనిచేసేందుకు పటిష్టమైన వ్యవస్థలను ఏర్పాటు చేయండి. సాంకేతిక మౌలిక సదుపాయాలు, ఐసీసీసీ (ఎఐఅఐ) వ్యవస్థను సమన్వయం చేసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు మనమందరం సమష్టిగా కృషి చేద్దాం” అని పిలుపునిచ్చారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనడానికి ఈ సదస్సు ఫలవంతమైన, నిర్మాణాత్మక చర్చలతో సాగాలని ఆకాంక్షించారు.“భద్రత, రక్షణ, నిస్పాక్షికంగా, నైతిక విలువలతో కూడిన సమర్థవంతమైన వ్యవస్థగా పోలీసింగ్ పనిచేయాలని ప్రజలు కోరుకుంటారు. పోలీసు వ్యవస్థకు ప్రభుత్వం సమకూర్చే వనరులను ఖర్చుగా భావించకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి, పౌరుల భద్రతకు పెట్టే పెట్టుబడిగా నేను భావిస్తాను. అందుకు ఎప్పటికప్పుడు అవసరమైన సంస్కరణలను తీసుకురావాలని భావిస్తా. రోజురోజుకు నేరాల స్వభావం మారుతున్న ఈ కాలంలో ఎస్ఆర్‌పీసీసీ వంటి వేదికలు ఎంతో కీలకంగా మారుతాయి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థ కూడా మారాలి. పోలీసింగ్‌లో సంస్కరణలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలి అని చెప్పారు.పోలీసు వ్యవస్థకు సంబంధించి తెలంగాణలో చేపట్టిన పలు సంస్కరణలు మంచి ఫలితాలను అందిస్తున్నాయి. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలను అరికట్టడం, వామపక్ష తీవ్రవాద హింసకు ముగింపు పలకడం వంటి రంగాల్లో తెలంగాణ పోలీసు శాఖ జాతీయ, అంతరాజ్యీయ స్థాయిలో విశేష ప్రతిభను చాటుకుని గుర్తింపు పొందింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి హైదరాబాద్ మహానగరంలో పోలీస్ వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా విభజించాం. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లుగా విభజించాం. ఈ విభజన వల్ల పోలీసు కమిషనర్లు తమ భౌగోళిక పరిధిపై ప్రత్యేక దృష్టి సారించి మరింత మెరుగైన ఫలితాలు అందించడానికి అవకాశం ఏర్పడింది. దీంతో పాటు నేరాల స్వభావానికి అనుగుణంగా ప్రత్యేక దృష్టిని సారించడానికి వీలుగా హైడ్రా , ఈగల్ , టీజీ-సేఫ్ , టీజీ టీమార్స్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశాం.ఈరోజుల్లో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు అత్యంత కీలకమైన అంశాలుగా మారాయి. ప్రతి విభాగం, ప్రత్యేక విభాగాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, శిక్షణపై దృష్టి సారించడం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించగలుగుతాం. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ప్రధానమంత్రి గారు నిర్వహించిన ప్రగతి (ఖఖీంఉయిఎ) సమీక్ష సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించడంతో పాటు రాష్ట్రాన్ని పూర్తిగా నక్సల్స్ రహితంగా మార్చడంలో విశేష కృషి చేసిన తెలంగాణ పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి అభినందించారు” అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తుచేశారు.“మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ (ఇంఉఒఇ) విభాగం సాధించిన పనితీరుకు కేంద్ర ప్రభుత్వం 80 శాతానికి పైగా మార్కులిచ్చింది. సైబర్ నేరాల బాధితులకు కోల్పోయిన సొమ్మును తిరిగి అందించడంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పింది. అమెరికాలోని ఎఫ్‌బీఏ తరహాలో ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణను బలోపేతం చేయడం కోసం సమన్వయంతో పనిచేసే కొత్త విభాగం టీజీ-సేఫ్ ను ప్రారంభించాం” అని సదస్సులో వివరించారు. తెలంగాణ ప్రారంభించిన హైడ్రా చెరువులు, జలవనరులను పరిరక్షించడం, పునరుద్ధరించడం, వాటికి పూర్వవై భవం తీసుకురావడం ద్వారా ప్రజల మనసులను గెలుచుకుంటోంది. అదే సమయంలో ప్రజా ఆస్తులు, ప్రభుత్వ ఆస్తుల భద్రతను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తోంది అని తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమించిన దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. “ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారు. పోలీసు సంక్షేమం విషయంలో కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యనిస్తోంది. వృత్తి రీత్యా పోలీసు సిబ్బంది ప్రధానంగా ఎదుర్కొనే సమస్యల్లో వారి పిల్లల భవిష్యత్తు ఒకటి. పోలీసు కుటుంబాల పిల్లలకు దేశంలోని అత్యుత్తమ సైనిక్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించేందుకు హైదరాబాద్‌లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేశాం. హోంగార్డు నుంచి డీజీపీ వరకు అన్ని స్థాయిల్లోని సిబ్బంది పిల్లలకు ఈ పాఠశాలలో విద్యను అభ్యసించే అవకాశం కల్పించాం. ఎంతో ధైర్యసాహసాలతో ప్రాణత్యాగం చేసిన పోలీసుల కుటుంబాల భవిష్యత్తుకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారి వరకు, వారి హోదా, సర్వీసు ఆధారంగా కనీసం రూ. 1 కోటి నుంచి గరిష్ఠంగా రూ. 2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నాం. ఇంటి స్థలంతో పాటు కుటుంబ సభ్యుల్లో అర్హులైన ఒకరికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించడం వంటివి అమలు చేస్తున్నాం” అని ముఖ్యమంత్రి పోలీసు సంక్షేమ కార్యక్రమాలను

ఢిల్లీని కాదు.. చైనాతో సరిహద్దుల్ని కాపాడండి..



న్యూఢిల్లీ, బీజేపీ ప్రభుత్వం కాపాడాల్సింది ఢిల్లీని కాదని.. చైనాతో ఇండియా పంచుకుంటున్న సరిహద్దును అని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే అన్నారు. తాజాగా చైనా సరిహద్దులో భారత జవాన్లతో చైనా సైన్యం ఘర్షణకు దిగుతుండటాన్ని దీప్కే తప్పుబట్టారు. సరిహద్దుల్ని కాపాడటానికి వినియోగించాల్సిన సైన్యాన్ని దేశంలో నిరసనల్ని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం వాడుతోందని దీప్కే విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు.అరుణాచల్ ప్రదేశ్‌లో, ఇండియా–చైనా సరిహద్దులో నిత్యం ఏదో ఒక చోట ఘర్షణ జరుగుతూనే ఉందని తాజాగా ఐటీబీపీ చీఫ్ శతృజీత్ కపూర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. మన సైన్యానికి, అక్కడ పని చేస్తున్న భారత సైన్యమైన ఐటీబీపీకి మధ్య కొద్ది రోజులుగా నిత్యం ఘర్షణ జరుగుతోందని ఆయన తెలిపారు. ఇక్కడ సరిహద్దు కోసం కేంద్రం కొత్తగా తయారు చేసిన శౌర్య కమాండోలు ధైర్యంగా పని చేస్తున్నట్లు కపూర్ తెలిపారు. ఇప్పుడు ఇదే అంశంపై దీప్కే కేంద్రాన్ని, ప్రధాని మోదీని ప్రశ్నించారు. సైన్యాన్ని వాడుకోవడంలో కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏంటని దీప్కే నిలదీశారు.దేశ సరిహద్దుల్ని రక్షించాల్సిన సైన్యాన్ని సొంత ప్రజలు నిరసన చేయకుండా వాడటం వల్లే చైనా సరిహద్దులో ఘర్షణ జరుగుతోందన్నారు. సొంత ప్రజల్ని అణచివేసేందుకు మోదీ దేశ భద్రతను పణంగా పెట్టారని విమర్శించారు. ప్రభుత్వం రక్షించాల్సింది ఢిల్లీని కాదని.. సరిహద్దుల్ని అని దీప్కే సూచించారు. శాంతియుత నిరసనల్ని అడ్డుకోవడం సరికాదన్నారు. మరోవైపు సరిహద్దులో చైనాతో చెలరేగుతున్న ఘర్షణపై కాంగ్రెస్ పార్టీ, శివసేన యూబీటీలు కూడా కేంద్ర ప్రభుత్వంపై మండిపడుతున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అని విమర్శిస్తున్నాయి.

ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యత

సిద్దిపేట: హుస్నాబాద్ నియోజకవర్గంలో పూర్తిగా ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ తెలిపారు.నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో, అత్యంత దయనీయ పరిస్థితుల్లో నివసిస్తున్న వారికి ముందుగా న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో ఇళ్లను కేటాయిస్తోందని పేర్కొన్నారు.అదేవిధంగా గౌరవెల్లి – గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయి, ఇప్పటివరకు ఎలాంటి ఇల్లు పొందని నిర్వాసితుల్లో భూమి ఉండి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి విస్తరణలో భాగంగా చిగురుమామిడి, సుందరగిరి తదితర ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన అర్హులైన కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి జనగామ మార్గంలో అక్కన్నపేట మీదుగా రహదారి విస్తరణ తదితర కారణాలతో ఇళ్లు కోల్పోయిన అర్హులైన వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.హుస్నాబాద్ చౌటపల్లి పద్ద ఇండస్ట్రియల్ పార్క్ కోసం భూములు ఇచ్చిన వారికి అర్హత ఉండి ఇల్లు లేని వారికి కూడా ఇందిరమ్మ ఇల్లు కేటాయించేల చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం..

ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలకు, వివిధ



సంపాదకీయం

శనివారం 24-10-2026

భూగర్భంలో గ్యాస్ తయారీ... అన్ని విధాలా లాభసాటి

విద్యుత్, ఇతర ఇంధన అవసరాలకు దేశీయంగా బొగ్గే ప్రధాన ఆధారంగా నిలుస్తోంది. ఉపరితలం నుంచి బొగ్గును వెలికి తీయడంతో పాటు నేరుగా దాన్ని కాల్చడం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతోంది. దీన్ని నివారించి భారత్ ఇంధన భద్రత సాధించడానికి అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ (యూసీజీ) ఎంతో తోడ్పడుతుంది. అందుకే ఇటీవల యూసీజీపై ఇండియా ప్రధానంగా దృష్టి సారిస్తోంది.తయారీ రంగ వృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఆధునిక సాంకేతికతల విస్తరణ వంటివి నేడు దేశాల అభివృద్ధికి కీలకంగా మారాయి. వాటన్నింటికీ నిరంతర విద్యుత్, ఇంధనం తప్పనిసరి అవసరాలవుతున్నాయి. వాటికోసం ఇప్పటికీ శిలాజ ఇంధనాలపైనే ఇండియా అధికంగా ఆధారపడుతూ భారీగా విదేశ మారకద్రవ్యాన్ని వెచ్చిస్తోంది. పైగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తలెత్తినప్పుడు ఇంధన సరఫరాలు నన్నగిల్లి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.దేశీయ ఇంధన అవసరాలను ఇప్పటికీ ప్రధానంగా బొగ్గే తీర్చుతోంది. భారతదేశంలో నలభై అయిదు వేలకోట్ల టన్నులకు పైగా బొగ్గునిల్వలు ఉన్నాయని అంచనా. అందులో సుమారు అయిదు వేల కోట్ల టన్నులు లిగ్నైట్ రూపంలో (అల్ప ప్రమాణ బొగ్గుగా పేర్కొనవచ్చు) లభ్యమవుతున్నాయి. మిగిలిన బొగ్గు నిల్వల్లో అధికభాగం ఒడిశా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలలో ఉన్నట్లు అంచనా. ఈశాన్య భారతదేశంలో తక్కువ కర్బనశాతం కలిగిన బొగ్గు లభ్యమవుతుంది. ఇటీవలి అంచనాల్లో ఆంధ్రప్రదేశ్‌లోనూ గణనీయంగా నిల్వలున్నట్లు వెల్లడైంది.

లోతునుబట్టి వెలికితీత

వివిధ ప్రాంతాల్లో లభ్యమయ్యే బొగ్గును ప్రామాణికంగా ఆంత్రసైట్, బిట్యూమినస్, లిగ్నైట్‌లుగా విభజించవచ్చు. ఆంత్రసైట్ అత్యధిక ప్రామాణికమైనది. తరవాతి స్థానం బిట్యూమినస్‌ది. సాపేక్ష వేడి, కార్బన్, తేమ శాతాలను బట్టి బొగ్గు ప్రామాణికతను నిర్ణయిస్తారు. ఆంత్రసైట్ బొగ్గులో 86శాతం నుంచి 97శాతం దాకా కార్బన్ ఉంటుంది. తేమ దాదాపు మృగ్యమే. సాపేక్ష వేడి 32 నుంచి 35 మెగాజౌల్స్ పర్ కిలోగ్రామ్ (ఎంజే/కేజీ)గా ఉంటుంది. బిట్యూమినస్‌లో 50 నుంచి 90శాతం కార్బన్ లభిస్తే, తేమ రెండు నుంచి 15శాతం వరకు ఉండవచ్చు. సాపేక్షవేడి 23 నుంచి 33 ఎంజే/కేజీగా ఉంటుంది. లిగ్నైట్‌లో 25 నుంచి 35శాతం కార్బన్, 35 నుంచి 55శాతం తేమ, సాపేక్షవేడి 17 నుంచి 18 ఎంజే/కేజీగా ఉంటాయి.బొగ్గు లభ్యమవుతున్న లోతులను బట్టి దాన్ని వెలికితీసేందుకు మెరుగైన విధానాలను అనుసరిస్తే పర్యావరణానికి ఎలాంటి హాని కలగదు. సాధారణంగా 300 మీటర్ల లోపు లోతుల్లో ఉన్న బొగ్గును ఉపరితల తవ్వకం ద్వారా బయటికి తీస్తారు. అంతకన్నా ఎక్కువ లోతుల్లో ఉంటే భూగర్భ కోల్ గ్యాసిఫికేషన్ (యూసీజీ) ప్రక్రియ ద్వారా రసాయన ప్రక్రియలకు గురిచేసి సిన్‌గ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు. ఇలాంటి పరిశ్రమలు పలు దేశాల్లో విజయవంతంగా పనిచేస్తున్నాయి. భారతదేశంలో ఇప్పటిదాకా ఉపరితల తవ్వకం ద్వారానే బొగ్గును అధికంగా వెలికితీస్తున్నారు. ఇటీవలి కాలంలో పరిశోధనల వల్ల అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్ (యూసీజీ) మొదలైంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని చింతలపూడి, రేచర్ల ప్రాంతాల్లో బిట్యూమినస్ బొగ్గు 600 మీటర్లకు మించిన లోతులో నిక్షిప్తమై ఉండటం యూసీజీకి అనుకూలమవుతుంది.

పర్యావరణానికి మేలు

ఉపరితల బొగ్గు తవ్వకంతో పోలిస్తే యూసీజీలో అనేక లాభాలున్నాయి. ఉపరితల బొగ్గు తవ్వకంలో గాలిలోకి అపరిమితమైన ధూళి చేరుతుంది. యూసీజీలో ధూళికాలుష్యం ఉండదు. ఉపరితలం నుంచి బొగ్గును వెలికితీసేటప్పుడు రవాణా, నిల్వ సమయంలో అధిక స్థాయిలో కార్బన్‌డయాక్సైడ్, మీథేన్ తదితర గ్రీన్‌హౌస్ వాయువులు వెలువడతాయి. యూసీజీలో చాలా చౌకగా కర్బన ఉద్గారాల పట్టివేత, నిల్వకు వీలుచిక్కుతుంది. ఉపరితల తవ్వకంలో ఘనవ్యర్థాలు, బూడిద, స్లాగ్ (చిట్టెం లేదా లోహ మలినం) అత్యధిక పరిమాణంలో విడుదలవుతాయి. యూసీజీలో ఘనవ్యర్థాలు దాదాపు ఉండవు. ఉపరితల తవ్వకంలో వెలువడే ఆమ్లగుణ కారకాలవల్ల నీటికాలుష్యం అధికంగా ఉంటుంది. 300 మీటర్లలోపు లోతు యూసీజీలో నీటి కాలుష్యం అదే స్థాయిలో ఉంటుంది. 600మీటర్లకు మించిన లోతుల్లో ఆ ప్రమాదం ఉండదని చెప్పవచ్చు. ఉపరితల తవ్వకంలో ధ్వని కాలుష్యమూ విపరీతమే. యూసీజీలో అది దాదాపు లేనట్లే. ఉపరితల తవ్వకంలో భూమిని తొలచడం వల్ల ఇక ఆ ప్రాంతం ఇతర వినియోగానికి పనికిరాదు. యూసీజీలో 300 మీటర్ల లోపు తవ్వకాలలో భూమి కుంగే వీలుంది. కానీ, 600 మీటర్ల పైబడి లోతుల్లో అది చాలా తక్కువ. ముఖ్యంగా బీమ్స్, పిల్లర్ల పద్ధతితో కేవ్ మోడల్ రసాయనిక ప్రక్రియలో భూమి కుంగడం ఉండదనే చెప్పవచ్చు. ఉపరితల తవ్వకంలో లోతుకు వెళ్లేకొద్దీ ఆకస్మిక వరదలు, మట్టిపెళ్లలు విరిగిపడే విపత్తుల వల్ల కార్మికుల భద్రతకు ముప్పు ఏర్పడుతుంది. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌లో ఆ భయాలేవీ ఉండవు. పైగా, ఉపరితల గనుల మూసివేతతో చూస్తే యూసీజీ గనుల మూసివేత చాలా సులువు. ఖర్చు తక్కువ. భద్రత ఎక్కువ. పర్యావరణ హితకరంగా వాటిని మూసివేయవచ్చు.అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌లో ఉత్పత్తి అయ్యే సిన్‌గ్యాస్, హైడ్రోజన్ వంటివి విద్యుత్తుతో పాటు యూరియా, అమ్మోనియా, ఎరువుల ఉత్పత్తికి ఉపయోగపడతాయి. దానివల్ల డ్రైవర్లు మొదలు సాంకేతిక నిపుణుల వరకు అనేక ఉపాధి అవకాశాలు అందివస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌లోకి రాబోతున్న రూ.2.73 లక్షల కోట్ల విలువైన భారీ పెట్టుబడుల వల్ల అనేక పరిశ్రమలు ఆవిర్భవిస్తాయి. దానివల్ల ఏపీకి రాబోయే ముప్పై సంవత్సరాల్లో రెండు లక్షల కోట్ల రూపాయల ఆదాయం లభించే అవకాశం ఉంది. అంతే కాకుండా సిన్‌గ్యాస్ వల్ల ఇండియాకు ఇంధన భద్రత లభిస్తుంది. అయితే, ఈ ప్రక్రియలో ఆధునిక సాంకేతికతను వివిధంగా ఉపయోగిస్తేనే మెరుగైన ఫలితాలు సిద్ధిస్తాయి. అప్పుడే పర్యావరణహితంగా దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

యాంటీ బీజేపీ స్టాండ్ తో వైసీపీ



విశాఖపట్టణం,వైసీపీ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో గళం విప్పనుందని తెలుస్తోంది. వైసీపీ ధినేత వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు కొంత కలకలం రేపుతున్నాయి. తాము కేంద్ర ఎన్నికల కమిషన్ నియామకంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు మద్దతిచ్చి తప్పు చేశామని జగన్ చెప్పడాన్ని బట్టి ఇక ఢిల్లీపై పోరుకు జగన్ సిద్ధమయినట్లు కనిపిస్తుంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్డీయే నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి గతంలో కొన్ని బిల్లుల విషయంలో మద్దతు ఇవ్వడంపై విచారం వ్యక్తం చేశారు. అయితే, ఆయన నేరుగా బీజేపీకి క్షమాపణలు చెప్పలేదు, కానీ కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు-2023 విషయంలో నాడు ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి పెద్ద తప్పు చేశామని వ్యాఖ్యానించారు. దీంతో వైసీపీకి, బీజేపీకి ఇప్పుడు మరింత దూరం పెరిగిందని చెప్పొచ్చు. పార్టీ 2024 ఎన్నికలలో ఓటమి పాలయినా జగన్ పార్టీ బీజేపీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి బిల్లుకు మద్దతిచ్చింది. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక సవరణ బిల్లుకు తాము మద్దతు ఇవ్వడం పొరపాటని జగన్ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ని నియామక కమిటీ నుంచి తొలగించి, ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చారు. దీనికి వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై, ఓటర్ల జాబితాల సవరణపై దేశవ్యాప్తంగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జగన్ స్పందించారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలపై ప్రజల్లో నమ్మకం కలగాలంటే మళ్లీ పాత నియామక పద్ధతినే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కమిటీలో ఉండేలా పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.తాము గతంలో కేంద్రానికి కేవలం అంశాల వారీగా మాత్రమే మద్దతు ఇచ్చామని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉందని వైసీపీ నేతలు స్పష్టం చేస్తున్నారు.... అయితే జగన్ కాంగ్రెస్ నేతృత్వం వహిస్తున్న ఇండియా కూటమిలో భాగస్వామిగా మారతారని మాత్రం అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే కాంగ్రెస్ జగన్ కు ప్రధాన శత్రువు. అందుకే దానికి దూరంగా ఉండే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి. అలాగని బీజేపీకి కూడా దగ్గరయ్యే ఛాన్సులు లేవు. ప్రస్తుతం పార్లమెంటులో ఏదైనా కీలకమైన బిల్లుల విషయంలో జగన్ పార్టీ ఇటు మద్దతు, అటు వ్యతిరేకత తెలపకుండా వాకౌట్ చేసే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరొకవైపు తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ బీజేపీ, కాంగ్రెస్ కు వ్యతిరేకంగా తృతీయ కూటమిని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉంది. అందులో భాగంగా జగన్ తో డీఎంకే నేతలు సంప్రదింపులు జరిపితే కొంత వరకూ ఆ కూటమిలో చేరే అవకాశముంది. మొత్తం మీద జగన్ దారి ఎటన్నది రాజకీయంగా చర్చనీయాంశమైంది. రానున్న కాలంలో దీనిపై పూర్తి స్థాయిలో క్లారిటీ రానుంది.

కాంగ్రెస్ ప్రజా ఉద్యమానికి విరుగుడుగా బీజేపీ ప్రతివ్యూహం

హైదరాబాద్, దేశంలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-సర్), ఎన్నికల సంఘం పనితీరుపై సాగుతున్న రాజకీయ పోరు కొత్త మలుపు తిరుగుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుండగా, 'సర్' ప్రక్రియను నిలిపివేయాలంటూ ఆ పార్టీ ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ విమర్శలకు దీటుగా సమాధానం చెప్పడంతో పాటు, రాజకీయంగా పైచేయి సాధించేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతివ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

దేశవ్యాప్త ప్రచారానికి కమలనాథుల కసరత్తు

ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల సంఘం పనితీరు వంటి అంశాలు ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసంతో ముడిపడి ఉన్నాయి. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల్లో ఉండటం, అనర్హమైన నమోదులను నిబంధనల ప్రకారం తొలగించడం, ఓటు హక్కు పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని బీజేపీ భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ చేపడుతున్న ఉద్యమం ప్రజల్లో ప్రభావం చూపకుండా, తమ వాదనను విస్తృతంగా తీసుకెళ్లేందుకు దేశవ్యాప్త ప్రచారానికి పార్టీ అధిష్ఠానం కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా అన్ని రాష్ట్రాల పార్టీ శాఖలను అప్రమత్తం చేయడంతో పాటు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు, రాష్ట్రస్థాయి నాయకులు, క్షేత్రస్థాయి కార్యకర్తలను భాగస్వాములను చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.బహిరంగ సభలు, ప్రజలతో ముఖాముఖి సమావేశా లు, స్థానిక స్థాయి కార్యక్రమాల ద్వారా కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానాలు ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైన చోట ఇంటింటి ప్రచారం చేపట్టి ప్రజలకు పార్టీ వైఖరిని వివరించే అవకాశాలనూ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఏడు అంశాలే ప్రచార అస్త్రాలు

'సర్' ప్రక్రియ అవసరం, ఎన్నికల సంఘం బాధ్యతలు, ఎన్నికల పారదర్శకత, కాంగ్రెస్ రాజకీయ వైఖరి, ప్రధాని నరేంద్ర మోదీ పాలన వంటి అంశాలను ఒకే ప్రచార వ్యూహంలో భాగం చేయాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ విమర్శలకు స్పందించడమే కాకుండా, ఆ పార్టీ గత పాలనను ప్రశ్నిస్తూ తమ ప్రభుత్వ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది వ్యూహంగా కనిపిస్తోంది.ఈ ప్రచారంలో ఏడు ప్రధాన అంశాలను ముందుకు తీసుకెళ్లాలని పార్టీ యోచిస్తున్నట్లు సమాచారం. వీటిని ప్రజలకు వివరించే బాధ్యతను ఎంపీలు, ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు, రాష్ట్రస్థాయి నేతలకు అప్పగించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎన్నికల రాజకీయాలు కీలకంగా మారనున్న రాష్ట్రాల్లో కేంద్ర మంత్రులతో ప్రచారం నిర్వహించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఎన్నికల రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి

దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా వంటి రాష్ట్రాలపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఈ రాష్ట్రాల్లో పార్టీ రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడంతో పాటు, 'సర్' వివాదం తమకు ప్రతికూలంగా మారకుండా చూడాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను రంగంలోకి దించి ప్రచారానికి విస్తృత స్థాయి కల్పించాలని యోచిస్తున్నట్లు సమాచారం. బహిరంగ సభలతో పాటు స్థానిక సమావేశాలు నిర్వహించి ప్రజల సందేహాలకు సమాధానాలు ఇవ్వడం, అవసరాన్ని బట్టి ఇంటింటి ప్రచారం చేపట్టడం వంటి కార్యక్రమాలపైనా దృష్టి పెట్టే అవకాశం ఉంది.అయితే, 'సర్' వివాదమే ఎన్నికల ఫలితాలను నిర్ణయిస్తుందని చెప్పలేం. స్థానిక సమస్యలు, ప్రభుత్వాల పనితీరు, నిరుద్యోగం, ధరల పెరుగుదల, సంక్షేమ పథకాలు, సామాజిక సమీకరణాలు కూడా ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల బీజేపీ ప్రచారం ఎంతవరకు ఫలితాన్నిస్తుందనేది ఆయా రాష్ట్రాల్లోని రాజకీయ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

తెలంగాణలోనూ కార్యాచరణకు సన్నాహాలు

దేశవ్యాప్త ప్రచారాన్ని తెలంగాణలోనూ అమలు చేసేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. దసరా పండుగ తర్వాత రాష్ట్రంలో ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.'సర్' ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఎన్నికల సంఘం బాధ్యతలు, ఓటర్ల జాబితాల సవరణలో అనుసరించే విధానాలను వివరించడంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నిస్తూ, కేంద్ర ప్రభుత్వ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.రాష్ట్రస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ వాదనను బలంగా వినిపించాలనేది లక్ష్యంగా కనిపిస్తోంది.

కాంగ్రెస్ ఉద్యమానికి విరుగుడుగా ప్రతివ్యూహం

కాంగ్రెస్ ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నిస్తూ ప్రజల్లో చర్చను ముందుకు తీసుకెళ్తుంటే, బీజేపీ ఆ విమర్శలకు సమాధానమిస్తూనే చర్చను మోదీ పాలన, కాంగ్రెస్ గత పాలన, ఎన్నికల పారదర్శకత వంటి అంశాల వైపు మళ్లించాలని చూస్తున్నట్లు సమాచారం. దీంతో 'సర్' వివాదం ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన చర్చను దాటి రెండు ప్రధాన పార్టీల మధ్య రాజకీయ ఆధిపత్య పోరుగా మారుతోంది.ఈ పోరులో కాంగ్రెస్ తన ఆరోపణలకు ఆధారాలను చూపించాల్సి ఉంటుంది. 'సర్' ప్రక్రియ వల్ల అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తన వైఖరిని స్పష్టం చేయాల్సి ఉంటుంది. మరోవైపు, ఎన్నికల సంఘం స్వతంత్రత, పారదర్శకతపై ప్రజలకు నమ్మకం కలిగించేలా సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత బీజేపీపైనా ఉంటుంది.రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా ప్రజల సందేహాలను వాస్తవాల ఆధారంగా నివృత్తి చేయడం రెండు పార్టీలకూ కీలకం కానుంది. బీజేపీ ప్రతిపాదిస్తున్న ప్రచార కార్యాచరణ అమల్లోకి వస్తే, 'సర్' వివాదంపై దేశవ్యాప్తంగా రాజకీయ చర్చ మరింత విస్తరించే అవకాశం ఉంది.



కాంగ్రెస్ ఉద్యమాన్ని ఎదుర్కొనేందుకు బీజేపీ ఏడు అస్త్రాలు

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎందుకు చేపడుతున్నారు? దాని అవసరం ఏమిటి? జాబితాలను సరిచేయడం వల్ల కలిగే ప్రయోజనాలేమిటి? అనే అంశాలను ప్రజలకు వివరించాలని బీజేపీ భావిస్తున్నట్లు సమాచారం. ఈ ప్రక్రియపై కాంగ్రెస్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు, ఓటర్ల జాబితాల ప్రాముఖ్యతను వివరించడంపై దృష్టి పెట్టనుంది.

ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా డిమాండ్‌కు కౌంటర్

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై బీజేపీ తన వాదనను బలంగా వినిపించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ బాధ్యతలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ అధికారాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను ప్రజలకు వివరించడంపై దృష్టి పెట్టనుంది. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు ఉన్న ఆధారాలేమిటన్న ప్రశ్నను కూడా ప్రచారంలో ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది.

కాంగ్రెస్ రాజకీయ వైఖరిపై విమర్శలు

ఎన్నికల కమిషన్ పనితీరుపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శల వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని బీజేపీ నేతలు వాదించే అవకాశం ఉంది. ఎన్నికల్లో ఎదురవుతున్న సవాళ్ల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆ పార్టీ ఈ అంశాన్ని ముందుకు తెస్తోందని ఆరోపించవచ్చు. అయితే, ఇవి రాజకీయ వాదనలేనని, వాటి ప్రభావం ప్రజల్లో ఎలా ఉంటుందనేది ప్రచార తీరుపై ఆధారపడి ఉంటుందని గమనించాలి.

మోదీ పాలన, సంక్షేమ పథకాలపై ప్రచారం

2014 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ విధానాలను బీజేపీ ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించాలని భావిస్తున్నట్లు సమాచారం. సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక విధానాలు, జాతీయ స్థాయి నిర్ణయాలను ప్రజలకు వివరించనుంది. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ ప్రజల మద్దతును తనకు అనుకూలంగా వివరించే ప్రయత్నం చేయనుంది.

రాహుల్ గాంధీపై విమర్శలతో ఎదురుదాడి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ వైఖరి, కేంద్ర ప్రభుత్వంపై ఆయన చేస్తున్న విమర్శలను కూడా బీజేపీ ప్రచారంలో ప్రస్తావించే అవకాశం ఉంది. విదేశీ శక్తులతో సంబంధాలున్నాయంటూ బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ తరహా ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించలేం. వాటిని ప్రస్తావించే పక్షంలో సంబంధిత ఆధారాలను చూపాల్సి ఉంటుంది.

ఎన్నికల పారదర్శకతపై వివరణ

ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఓటర్ల జాబితాల తయారీ, సవరణ విధానాలు, ఎన్నికల సంఘం బాధ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియపై సందేహాలు వ్యక్తమవుతున్న సమయంలో వాటికి వాస్తవాల ఆధారంగా సమాధానాలు ఇవ్వడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని యోచిస్తోంది. ఎన్నికల సంఘం స్వతంత్రతకు సంబంధించిన ప్రశ్నలపైనా స్పష్టమైన వివరణ అవసరం కానుంది.

కాంగ్రెస్ ఉద్యమంపై రాజకీయ ఎదురుదాడి

ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఎన్నికల సంఘంపై విమర్శలు చేస్తోందని బీజేపీ ప్రచారంలో ఆరోపించే అవకాశం ఉంది. రాజ్యాంగ వ్యవస్థలపై కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నిస్తూ, ఆ పార్టీ ఉద్యమాన్ని రాజకీయంగా బలహీనపరచాలని భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇవి బీజేపీ తరఫున వినిపించే రాజకీయ ఆరోపణలు మాత్రమే. వాటి ప్రభావం ప్రజల స్పందనపై ఆధారపడి ఉంటుంది.

సల్మాన్ ఖాన్ తర్వాత అమితాబ్ బచ్చన్, అక్షయ్ కుమార్‌లేనట!

ముంబై, బాలీవుడ్ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన టైగర్ ష్రాఫ్ కాల్పుల ఘటన దర్యాప్తులో పోలీసులు కీలక విషయాలు రాబట్టారు. రాజస్థాన్‌లోని కోటా నుంచి ముంబయికి తరలిస్తున్న సమయంలో నిందితులు పోలీసుల ఎదుట విస్మయకరమైన నిజాలు ఒప్పుకున్నారు. వాస్తవానికి ఈ ముగ్గురు దుండగుల ప్రధాన టార్గెట్ బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ అని తేలింది. ముంబయిలోని బాంద్రాలో ఉన్న సల్మాన్ నివాసం వద్ద నిందితులు పలుమార్లు రెక్కీ నిర్వహించి, ఆయన కదలికలను క్షుణ్ణంగా ట్రాక్ చేశారు. అయితే సల్మాన్ ఖాన్ చుట్టూ ఉన్న భారీ, పటిష్టమైన భద్రతా వలయాన్ని చూసి వారు సమీపించలేకపోయారు. కేవలం సల్మాన్ మాత్రమే కాకుండా అక్షయ్ కుమార్, అమీర్ ఖాన్, లెజెండరీ నటుడు అమితాబ్ బచ్చన్ ఇళ్ల వద్ద కూడా వీరు రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో బయటపడింది.సల్మాన్ ఖాన్ వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండటంతో.. సులభంగా టార్గెట్ చేయగల సెలబ్రిటీ కోసం దుండగులు అన్వేషించారు. ఈ క్రమంలోనే నటుడు టైగర్ ష్రాఫ్ జుహులోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌కు క్రమం తప్పకుండా వస్తాడని, అక్కడ ఆయనకు సెక్యూరిటీ తక్కువగా ఉంటుందని కొందరు సోషల్ మీడియాలో రీల్స్ చేయడంతో ఈ విషయాన్ని గుర్తించారు. అయితే దాడి జరగడానికి వారం రోజుల ముందే అంటే అక్టోబర్ 11వ తేదీన సదరు ముగ్గురు నిందితులు ఆ ఫుట్‌బాల్ మైదానానికి వెళ్లి రెక్కీ నిర్వహించారు. ఆ రోజు టైగర్ ష్రాఫ్ అక్కడ అందుబాటులో లేకపోవడంతో దాడి వాయిదా పడింది. చివరకు అక్టోబర్ 18వ తేదీన జుహు ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ కారును లక్ష్యంగా చేసుకుని దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో అదృష్టవశాత్తూ నటుడు ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు.కోటాలో అదుపులోకి తీసుకున్న నిందితులను అక్టోబర్ 21వ తేదీన తెల్లవారుజామున ముంబయికి తీసుకువచ్చి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న అనిల్ పండిట్ పాత్రపై, అలాగే అసలు సూత్రధారి ఎవరనే దానిపై ముంబయి పోలీసులు తీవ్రస్థాయిలో విచారణ జరుపుతున్నారు. మరోవైపు ఈ పరిణామాలపై స్పందించిన అనుభవజ్ఞుడైన ప్రముఖ గాయకుడు అనూప్ జలోటా.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలంటే సల్మాన్ ఖాన్ బిష్ణోయ్ సంఘానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని సూచించారు. లేకపోతే బిష్ణోయ్ వర్గం నుంచి ఇలాంటి దాడులు కొనసాగే ప్రమాదం ఉందని, సల్మాన్‌తో కలిసి పనిచేయాలనుకునే వారి కుటుంబాలు కూడా భయందోళనలో బతకాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

మహానగరాల్లో భారీగా పెరుగుతున్న అద్దెలు

హైదరాబాద్, దేశంలోని ప్రముఖ ఐటీ, వాణిజ్య మహానగరాలైన హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ఉద్యోగులు, వలస కుటుంబాలకు అద్దె ఇళ్ల నిర్వహణ ఓ పెద్ద పీడకలగా మారుతోంది. కరోనా అనంతరం వర్క్ ఫ్రమ్ హోమ్ నిబంధనలు తొలగిపోయి, దాదాపు అన్ని ప్రైవేట్, ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ ఆఫీస్ ను తప్పనిసరి చేయడంతో ఒక్కసారిగా అద్దె ఇళ్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఇదే అవకాశంగా భావించిన ఇంటి యజమానులు అడ్డగోలుగా అద్దెలు పెంచేయడమే కాకుండా, సెక్యూరిటీ డిపాజిట్ల పేరుతో భారీగా నిధులు దండుకుంటున్నారు.హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, తెల్లాపూర్ వంటి ఐటీ కారిడార్లలో సాధారణ ఫ్లాట్లకు కూడ

సిక్కోలులో విచిత్రం...టీడీపీ అభ్యర్థే..వైసీపీ మేయర్

శ్రీకాకుళం,శ్రీకాకుళం టీడీపీ నేత గుండా లక్ష్మి దేవి పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే అయిన ఆమెకు గత ఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించారు. కూటమి ప్రభుత్వంలో తను ఆశించిన ప్రాధాన్యత దక్కకపోవడం, పొత్తులో భాగంగా మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో అసంతృప్తికి గురయ్యారు. అదే సమయంలో వైసీపీ నుంచి ఆమెకు మేయర్ ఆఫర్ వచ్చింది. మేయర్ టిక్కెట్ ఇస్తామని ఆశపెట్టడంతో పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు.సుమారు 40 ఏళ్ల పాటు ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయకత్వం వరకు టీడీపీ అభివృద్ధి కోసం తన కుటుంబం అంకితమై పనిచేసిందని, అలాంటి పార్టీని ఇప్పుడు వీడాల్సి రావడం ఎంతో బాధగా ఉందని గుండ లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త, దివంగత మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అడుగుజాడల్లో నడుస్తూ శ్రీకాకుళంలో పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన తనకు, కీలకమైన సమయంలో తగిన గుర్తింపు లభించలేదని ఆమె వాపోయారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన తమను కాదంటూ స్థానికంగా కొందరు వ్యూహాత్మకంగా అణగదొక్కాలని చూశారని, ఈ అవమానాల భారాన్ని మోయలేకే పార్టీ వీడేందుకు సిద్ధమయ్యామని ఆమె తన సన్నిహితులు, అనుచరుల వద్ద ఆవేదన వెళ్లగక్కినట్లు తెలుస్తోంది.శ్రీకాకుళం మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు రంగంలోకి దిగి గుండ లక్ష్మీదేవిని పార్టీలోకి ఆహ్వానించడంతో పాటు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా ఆమెను బరిలో దింపేందుకు రంగం సిద్ధం చేశారు. నగరంలో గుండ కుటుంబానికి ఉన్న బలమైన పట్టును, సామాజికవర్గ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ఖర్చంతా పార్టీయే భరిస్తుందని హామీ ఇవ్వడంతో.. గుండ లక్ష్మీదేవి వైసీపీ కండువా కప్పుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. త్వరలోనే ఆమె తన అనుచరులతో విస్తృత సమావేశం నిర్వహించి అధికారికంగా ఫ్యాన్ పార్టీ గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది.

విజయనగరంలో దెబ్బకు సిక్కోలులో రీవెంజ్

స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట ఉత్తరాంధ్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనును తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి టీడీపీ షాకిచ్చింది. మజ్జి శ్రీను పార్టీ మారడం విజయనగరం జిల్లాలో వైసీపీకి గట్టి షాక్ అని చెప్పొచ్చు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఆయనకు అనుచరగణం ఉంది. మజ్జి శ్రీనుతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు కూడా టీడీపీలోకి వెళ్లారు. 2019 ఎన్నికల్లో విజయనగరం జిల్లాలో జగన్ పార్టీ క్లీన్‌స్వీప్ చేయడంలో ఈయన కీలక పాత్ర పోషించారు. పార్టీలో చేరగానే ఆయనకు అరకు లోక్ సభ టీడీపీ అబ్జర్వర్‌గా బాధ్యతలు అప్పగించారు.మజ్జి శ్రీనును చేర్చుకోవడం ద్వారా విజయనగరం జిల్లాలో వైసీపీని టీడీపీ దెబ్బకొడితే.. గుండ ఫ్యామిలీని తమవైపు తిప్పుకోవడం ద్వారా తెలుగుదేశం పార్టీకి శ్రీకాకుళంలో రివర్స్ షాక్ ఇవ్వడానికి వైసీపీ రెడీ అవుతోంది.శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి టీడీపీకి రాజీనామా చేసి.. వైసీపీలో చేరబోతున్నారు. తెలుగు దేశం పార్టీతో గుండ ఫ్యామిలీకి 40 ఏళ్ల అనుబంధం ఉంది. 1982లో ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు ఆమె భర్త గుండ అప్పల సూర్యనారాయణ టీడీపీలో చేరారు. అప్పల సూర్యనారాయణ వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన మంత్రిగానూ పని చేశారు. 1985, 1989, 1994, 1999ల్లో ఆయన శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2004, 2009 ఎన్నికల్లో ధర్మాన ప్రసాద రావు చేతిలో ఆయన ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో అప్పల సూర్యనారాయణ సతీమణి లక్ష్మీదేవి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఆమె ఓటమిపాలవగా.. 2024 ఎన్నికల్లో ఆమెకు టికెట్ కేటాయించలేదు. అప్పల సూర్యనారాయణ అనుచరుడిగా వ్యవహరించిన గోండు శంకర్‌కు టీడీపీ టికెట్ దక్కగా, ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. 2026 జనవరి 12న అప్పల సూర్యనారాయణ కన్నుమూశారు. శ్రీకాకుళంలో రెండు చోట్ల ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని తన కుమారులు చంద్రబాబు నాయుణ్ని కలిసి కోరారని.. పార్టీ అధినేత అంగీకరించినా, విగ్రహం ఏర్పాటు చేయనీయలేదని లక్ష్మీదేవి వాపోయారు. 40 ఏళ్లుగా పార్టీలో ఉంటున్న తమను అవమానాలకు గురి చేస్తున్నారని, తట్టుకోలేకే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని ఆమె ప్రకటించారు.గుండ లక్ష్మీదేవి తన అనుచరులతో కలిసి వైఎస్సార్సీపీలో చేరబోతున్నారని ధర్మాన ప్రసాద రావు ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు. 50 వేల మంది అనుచరులతో ఆమె వైసీపీలోకి రాబోతున్నారన్నారు. గుండ లక్ష్మీదేవి ధర్మాన బ్రదర్స్‌కు వరుసకు సోదరి అవుతారు. టీడీపీలో గుండ ఫ్యామిలీ అసంతృప్తితో ఉన్న విషయాన్ని గమనించిన ధర్మాన ఆమెను వైసీపీలోకి ఆహ్వానించారని తెలుస్తోంది. గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరితే ఆమెకు మేయర్ టికెట్ ఇస్తామని.. ఖర్చు మొత్తం తామే భరిస్తామని ధర్మాన హామీ ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కోర్టు కేసు కారణంగా శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలు ఇప్పుడు జరగడం లేదు. అంతేకాదు 2029 ఎన్నికల్లో ఆమె చిన్నకుమారుడు గుండ విశ్వనాథ్‌కు శ్రీకాకుళం ఎంపీ టికెట్ కూడా ఇచ్చే అవకాశం ఉందని సమాచారం.శ్రీకాకుళం మేయర్ రేసులో వైసీపీ తరఫున గుండ లక్ష్మీదేవి నిలబడితే.. కూటమి అభ్యర్థికి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళంలో గుండ ఫ్యామిలీకి మంచి పట్టు ఉంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సీట్ల పంపకాల్లో భాగంగా శ్రీకాకుళం మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. టీడీపీ ఓటు బ్యాంక్ పూర్తిగా జనసేనకు బదిలీ అవుతుందా అనేది ఒక ప్రశ్న. అలాగే గుండ లక్ష్మీదేవి వెంట ఆమె అనుచరగణం కూడా పార్టీ మారితే.. టీడీపీ ఓటు బ్యాంకుకు కూడా గండిపడుతుంది. ఈ రెండూ జనసేన అభ్యర్థికి పడే ఓట్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

దసరా రికార్డులు...18 లక్షల దర్శనాలు.. 36 లక్షల లడ్డూలు

విజయవాడ, విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం భారీగా భక్తులు తరలివచ్చారు. లడ్డూ ప్రసాదం విక్రయాల్లో సరికొత్త రికార్డును నమోదు చేశాయి. దుర్గమ్మ దర్శనార్థం వచ్చిన లక్షల మంది భక్తులకు ఎటువంటి కొరత రాకుండా దేవాదాయ శాఖ కమిషనర్ పర్యవేక్షణతో దేవస్థానం పకడ్బందీ ప్రణాళికతో లడ్డూ ప్రసాదాన్ని అందుబాటులో ఉంచింది. ఉత్సవాలు ప్రారంభమైన అక్టోబర్ 11 నుంచి అక్టోబర్ 21 దసరా మరుసటి రోజువరకూ భక్తుల రద్దీ ఇలా ఉండిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 10 రోజులలో మొత్తం 15,05,359 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా.. అక్టోబర్ 21 రాత్రి 7 గంటల సమయానికి సుమారు 1,55,000 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 11 రోజుల్లో కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తుల సంఖ్య 18,60,359 కి చేరింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లలో పటిష్టమైన ఏర్పాట్లు, మంచినీరు, ప్రసాదం పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. భక్తులు దేవస్థాన నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా దర్శనాలు పూర్తి చేసుకుంటున్నారు.ఈ ఏడాది ?దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో లడ్డూ ప్రసాదం విక్రయాల్లో సరికొత్త రికార్డు...?10 రోజుల్లో రికార్డు స్థాయిలో 30,69,048 లడ్డూల విక్రయం జరిగింది. ఈ సంఖ్య గతేడాది కన్నా 7.49 లక్షలు అధికం. ఇక ?12వ రోజైన సాయంత్రం 6:00 గంటల వరకు 5,08,676 లడ్డూలు విక్రయం జరిగింది. ఇప్పటివరకూ విక్రయించిన లడ్డూల సంఖ్య 35,77,724. ?భక్తుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి కొరత లేకుండా నిరంతరాయంగా లడ్డూ ప్రసాదం అందిస్తున్నారు దేవస్థానం అధికారులు.

రెట్టింపైన కూరగాయల దిగుబడి...



హైదరాబాద్, ఎల్ నినో ఎఫెక్ట్, సాగు నీటి కష్టాల వేళ తెలంగాణ వ్యవసాయ రంగంలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఒకప్పుడు పత్తి, వరి, కంది పంటలకే ఎక్కువగా పరిమితమైన వికారాబాద్ జిల్లా రైతులు ఇప్పుడు కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దాదాపు 30 ఏళ్ల తర్వాత జిల్లాలో రికార్డు స్థాయిలో కూరగాయల సాగు చేపడుతున్నారు. వానాకాలం, యాసంగి సీజన్లను కలిపి ఈసారి సుమారు 75 వేల ఎకరాల్లో కూరగాయలు పండించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న కూరగాయల డిమాండ్, సాగుకు అనుకూలమైన భూములు, ప్రభుత్వ రాయితీలు ఈ మార్పునకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, శంషాబాద్ తదితర మండలాల్లో కూరగాయలు, పూల సాగు విస్తృతంగా జరిగేది. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయానికి అనుకూలమైన భూములు ఉండటంతో నగరానికి అవసరమైన తాజా ఉత్పత్తులు పెద్దఎత్తున సరఫరా అయ్యేవి. అయితే కాలక్రమంలో స్థిరాస్తి వ్యాపారం విస్తరించడంతో వ్యవసాయ భూముల వినియోగంలో మార్పులు వచ్చాయి. దీంతో కూరగాయలు, పూల సాగు గణనీయంగా తగ్గిపోయింది. వికారాబాద్ జిల్లా ఏర్పడిన తర్వాత అక్కడి రైతులు సుమారు ఐదు లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంలో ప్రధానంగా పత్తి, వరి, కంది పంటలను పండించేవారు. నవాబ్‌పేట, మోమిన్‌పేట ప్రాంతాలు మినహా ఇతర మండలాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పూలను ఎక్కువగా కుటుంబ అవసరాల కోసమే సాగుచేసేవారు.ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. ఈ వానాకాలంలో జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. వరి, కంది పంటలు కూడా విస్తృతంగా సాగవుతున్నాయి. వీటి తర్వాత కూరగాయల సాగు ఎక్కువగా సాగవుతోంది. హైదరాబాద్ నగర జనాభాకు అవసరమైన కూరగాయలు శివారు ప్రాంతాలతోపాటు ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఆశించిన స్థాయిలో సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలో రాజధానికి 70 నుంచి 100 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వికారాబాద్ జిల్లాలో కూరగాయల ఉత్పత్తిని పెంచేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నగర మార్కెట్లకు సమీపంగా ఉండటం వల్ల పంటలను త్వరగా తరలించేందుకు తాజాదనాన్ని కాపాడేందుకు అవకాశం ఉండటం కూడా సాగు విస్తరణకు దోహదపడుతోంది.మరోవైపు ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు రైతులకు ఊతమిస్తున్నాయి. నీటి కుంటలు, పందిళ్ల ఏర్పాటుకు 50 శాతం, డ్రిప్ పరికరాలకు 70 నుంచి 90 శాతం వరకు రాయితీలు అందుతున్నాయి. తోటల ఏర్పాటుకు అవసరమైన నారు మొక్కలు, విత్తనాలను కూడా రాయితీపై సరఫరా చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 120 నర్సరీలు ఏర్పాటవగా, ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి జిల్లాల నుంచి నాణ్యమైన నారును తెప్పించి రైతులకు అందిస్తున్నాయి. నాణ్యమైన విత్తనాలు, నారు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం పెరుగుతుండటంతో ఉద్యానశాఖ అధికారులు కూడా ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. రాష్ట్రస్థాయి అధికారులు నెలలో ఒకటి, రెండు సార్లు జిల్లాలో పర్యటిస్తూ రైతులతో మాట్లాడి సమస్యలు, అవసరాలను తెలుసుకుంటున్నారు. కొడంగల్, పరిగి, దోమ తదితర ప్రాంతాల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను హైదరాబాద్‌కు తరలించేందుకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం, ఉద్యాన పంటల హబ్ ఏర్పాటు చేయడం వంటి ప్రణాళికలు సాగు విస్తరణకు మరింత ఊతమివ్వనున్నాయి.గత మూడు దశాబ్దాలుగా జిల్లాలో ఏటా 15 వేల నుంచి 20 వేల ఎకరాల్లో మాత్రమే కూరగాయలు సాగయ్యేవి. అయితే, 2026-27 వానాకాలంలోనే 44,610 ఎకరాల్లో సాగు చేపట్టడం గమనార్హం. యాసంగి సీజన్‌లో మరో 32 వేల ఎకరాల్లో కూరగాయలు పండించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ లక్ష్యాలు నెరవేరితే హైదరాబాద్ మార్కెట్లకు స్థానికంగా కూరగాయల సరఫరా పెరగడంతోపాటు,

పవన్ ఓటు.. టీడీపీకి లాభం!



అమరావతి,టీడీపీ- జనసేన పొత్తు వల్ల పవన్‌కు అధికారం.. చంద్రబాబుకు రాజకీయ లాభం! మరి జనసైనికులకు మిగిలేదేమిటి? రాజకీయాల్లో స్నేహాలు శాశ్వతం కావు. ప్రయోజనాలు ఉన్నంతవరకే పొత్తులు కొనసాగుతాయి.ఎవరికి ఎక్కడ లాభం ఉందో అక్కడే రాజకీయ నాయకుల అడుగులు పడతాయి. కానీ ఒక పార్టీ తన స్వంత ఎదుగుదలను పక్కనపెట్టి, మరో పార్టీ ఎదుగుదల కోసం పనిచేస్తున్నట్లు కనిపిస్తే మాత్రం ఆ పార్టీ కార్యకర్తలకు కొన్ని ప్రశ్నలు రావడం సహజం.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు జనసేన పరిస్థితి చూస్తుంటే అలాంటి ప్రశ్నలే వినిపిస్తున్నాయి. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన కార్యకర్తలు, పవన్ కల్యాణ్ ను నమ్ముకుని రాజకీయ భవిష్యత్తు కోసం ఎదురుచూసిన నాయకులు ఇప్పుడు తమలో తామే ఒక ప్రశ్న వేసుకుంటున్నారా?మనం జనసేనను అధికారంలోకి తీసుకురావడానికి పనిచేశామా? లేక టీడీపీ అధికారాన్ని మరింత బలోపేతం చేయడానికే పనిచేశామా? స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల పంపకాల చర్చ ఈ ప్రశ్నలకు మరింత పదును పెట్టింది.2024 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పోటీ చేసిన 21 స్థానాల్లోనూ విజయం సాధించింది. ఈ విజయాన్ని పవన్ కళ్యాణ్ రాజకీయ చరిత్రలో ఒక గొప్ప మైలురాయిగా అభిమానులు భావించారు. పార్టీకి ప్రజల్లో ఆదరణ ఉందని, సరైన అవకాశం ఇస్తే జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదగగలదని ఆ ఫలితాలు నిరూపించాయని చెప్పారు.అయితే ఆ విజయాన్ని పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవడానికి ఉపయోగించుకోవాల్సిన సమయం వచ్చినప్పుడు జనసేన ఏం చేస్తోంది? గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకోవాలి. మున్సిపాలిటీల్లో సొంత నాయకత్వాన్ని తయారు చేసుకోవాలి. పార్టీ కోసం కష్టపడిన వారికి అవకాశాలు కల్పించాలి. వచ్చే ఎన్నికల నాటికి టీడీపీతో సమానంగా కాకపోయినా, తనకంటూ ప్రత్యేకమైన రాజకీయ బలాన్ని నిర్మించుకోవాలి.కానీ స్థానిక ఎన్నికల సీట్ల పంపకాల దగ్గర జనసేనకు ఎన్ని స్థానాలు దక్కాయన్న చర్చే ఇప్పుడు ప్రధానమైంది. తాజా వార్తా కథనాల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి టీడీపీకి 89, జనసేనకు 25, బీజేపీకి 9 స్థానాలు కేటాయించినట్లు వార్తలు వస్తున్నాయి. కార్పొరేషన్ల విషయంలోనూ జనసేనకు పరిమితమైన అవకాశాలే దక్కినట్లు చర్చ జరుగుతోంది.ఇక్కడ ప్రశ్న జనసేనకు 25 స్థానాలు వచ్చాయా, 30 వచ్చాయా అనేది మాత్రమే కాదు. పార్టీకి వచ్చిన రాజకీయ అవకాశాలను తన బలాన్ని పెంచుకోవడానికి ఉపయోగించుకుంటోందా లేదా అనేదే అసలు ప్రశ్న. అసెంబ్లీలో సాధించిన విజయాన్ని పార్టీ విస్తరణకు ఉపయోగించుకోలేకపోతే, ఆ విజయంతో చివరకు లాభపడేది ఎవరు?

చంద్రబాబుకు రాజకీయ లెక్కలు ఉన్నాయి.. మరి పవన్‌కు?

ఇలాంటి రాజకీయాల్లో చంద్రబాబు అనుభవం గురించి చెప్పనక్కర్లేదు! ఏ నిర్ణయం తీసుకుంటే పార్టీకి లాభం జరుగుతుంది, ఏ ప్రాంతంలో ఎవరికి అవకాశం ఇవ్వాలి, అధికారాన్ని ఎలా బలోపేతం చేసుకోవాలి అనే విషయాల్లో ఆయనకు తనదైన రాజకీయ లెక్కలు ఉంటాయి.సూటిగా చెప్పాలంటే ఎవర్ని ఎలా వాడుకోవాలో ఆయనకు తెలిసినట్టుగా తెలుగు రాజకీయాల్లో మరొకరికి తెలియదనేది చాలా పాత మాట! ఈ లెక్కల ప్రకారం టీడీపీ తన బలాన్ని పెంచుకోవాలని చూడటంలో తప్పేమీ లేదు. ప్రతి పార్టీ అదే చేస్తుంది. తన పార్టీకి ఎక్కువ స్థానాలు కావాలని కోరుకోవడం కూడా సహజమే.కానీ జనసేన అధినేతగా పవన్ కళ్యాణ్ బాధ్యత ఏమిటి? తన మిత్రపక్షం బలపడాలని కోరుకోవడం ఒకటి. చంద్రబాబు తన పార్టీ కోసం రాజకీయం చేస్తుంటే, పవన్ కల్యాణ్ తన పార్టీ కోసం ఎంతవరకు రాజకీయం చేస్తున్నారు? జనసేనకు భవిష్యత్తులో స్వతంత్రంగా ఎదగడానికి అవసరమైన పునాది వేస్తున్నారా? లేక కూటమి ఐక్యత పేరుతో ప్రతిసారీ సర్దుకుపోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నారా?ఈ ప్రశ్నలు అడిగినంత మాత్రాన ఎవరూ టీడీపీ వ్యతిరేకులు అయిపోరు. జనసేన ఎదగాలని కోరుకునే కార్యకర్తలు కూడా ఇలాంటి ప్రశ్నలు అడగవచ్చు. ఎందుకంటే మిత్రపక్షానికి అధికారం రావడం ఒక రాజకీయ విజయం కావచ్చు. కానీ సొంత పార్టీకి భవిష్యత్తు నిర్మించడం నాయకుడి బాధ్యత. పవన్ కల్యాణ్‌కు అభిమానుల్లో చాలామంది ఆయన కోసం రాజకీయాలకు మద్దతు ఇచ్చారు. ఆయన పిలుపుతో కూటమికి ఓటు వేసినవారు కూడా ఉన్నారు. అయితే ఆ ప్రజాదరణను జనసేన సంస్థాగత బలంగా మార్చుకోవడం ఎంతవరకు సాధ్యమైంది?ఇదే కీలకమైన ప్రశ్న. పవన్ కల్యాణ్ ప్రజాదరణ కూటమికి ఉపయోగపడుతుంది. ఆయన ప్రచారం కూటమి అభ్యర్థులకు మద్దతు సమీకరించగలదు. ఆయన రాజకీయ నిర్ణయం కూటమి ఓట్లపై ప్రభావం చూపగలదు. ఈ బలం టీడీపీకి కూడా ఉపయోగపడుతుంది.కానీ అదే సమయంలో జనసేనకు ఎన్ని స్థానాలు దక్కుతున్నాయి? పార్టీకి ఎంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు తయారవుతున్నారు వచ్చే ఎన్నికల నాటికి జనసేన తన సొంత రాజకీయ శక్తిని ఎంత పెంచుకోగలుగుతుంది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేకపోతే, జనసేన అభిమానులు ఆందోళన చెందడంలో ఆశ్చర్యం లేదు. ప్రజాదరణను సంస్థాగత బలంగా మార్చుకోలేకపోవడం మాత్రం రాజకీయంగా నష్టమే.

జనసైనికులకు జెండా మోయడమేనా బాధ్యత?

జనసేన కార్యకర్తలలో చాలామంది పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు ప్రచారం చేశారు. నాయకుడి పిలుపునకు స్పందించారు. పార్టీ అధికారంలోకి వస్తే తమకూ అవకాశాలు వస్తాయని ఆశించారు.ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినప్పుడు టికెట్ల పంపకాలపై చర్చ జరుగుతోంది. ప్రతి ప్రాంతంలో పార్టీకి అవకాశం రావాలని కార్యకర్తలు కోరుకుంటున్నారు. అయితే పొత్తు లెక్కల్లో జనసేనకు పరిమితమైన స్థానాలే దక్కితే, మిగిలిన ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలు ఏం చేయాలి?టీడీపీ అభ్యర్థుల విజయానికి పనిచేయాలా? పనిచేయకపోతే పొత్తు ధర్మాన్ని ఉల్లంఘించినట్లవుతుందా? పనిచేస్తే తమ పార్టీ ఎదుగుదల కోసం ఎప్పుడు పనిచేయాలి?ఇదే జనసేన కార్యకర్తల ముందున్న రాజకీయ సందిగ్ధత. పొత్తు అంటే ఒకరికి ఒకరు సహకరించుకోవడం. కానీ సహకారం పేరుతో ఒక పార్టీ కార్యకర్తలు తమ రాజకీయ భవిష్యత్తును నిరంతరం వాయిదా వేసుకుంటూ ఉండాలా?జనసేన కార్యకర్తలకు ఈ ప్రశ్నకు సమాధానం కావాలి. వారిని కేవలం ఎన్నికల సమయంలో జెండాలు పట్టుకునే వారిగా కాకుండా, పార్టీ భవిష్యత్తును నిర్మించే రాజకీయ శక్తిగా చూడాలి.

ట్రోలింగ్‌కు కారణం సీట్లు మాత్రమే కాదు!

సోషల్ మీడియాలో జనసేనపై జరుగుతున్న ట్రోలింగ్‌ను కేవలం ప్రత్యర్థుల కుట్రగా కొట్టిపారేయడం సులభం. కానీ ప్రతి విమర్శ వెనుక కుట్రే ఉందని అనుకోవడం సరైంది కాదు.కొన్ని విమర్శలు రాజకీయ ప్రత్యర్థుల నుంచి వస్తాయి. మరికొన్ని అభిమానుల అసంతృప్తి నుంచి వస్తాయి. ఇంకొన్ని రాజకీయ పరిణామాలను చూసి వ్యంగ్యంగా స్పందించే వారి నుంచి వస్తాయి. జనసేన అభిమానులకు బాధ కలిగిస్తున్న అంశం కేవలం సీట్ల సంఖ్య కాదు. తమ నాయకుడు పార్టీ ప్రయోజనాలను ఎంత బలంగా ముందుకు తీసుకెళ్లగలరన్నదే.పవన్ ప్రతి నిర్ణయాన్నీ సమర్థించాల్సిన బాధ్యత అభిమానులపై లేదు. అలాగే ప్రతి నిర్ణయాన్ని విమర్శించాల్సిన అవసరమూ లేదు. కానీ పార్టీ ఎదుగుదలపై ప్రశ్నలు వస్తే వాటిని శత్రుత్వంగా చూడకుండా చర్చించాలి.జనసేనకు రాజకీయ భవిష్యత్తు ఉండాలని కోరుకునేవారు, పార్టీకి మరిన్ని అవకాశాలు కావాలని అడిగేవారు, సొంత నాయకత్వం బలపడాలని కోరుకునేవారు.. వీరంతా పార్టీకి వ్యతిరేకులు ఎలా అవుతారు?పార్టీ కోసం పనిచేసే వ్యక్తి తన పార్టీ ఎదుగుదల గురించి ప్రశ్నించలేకపోతే, ఆ పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం గురించి కూడా ప్రశ్నలు తలెత్తుతాయి.టీడీపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల జనసేనకు అధికారంలో భాగస్వామ్యం లభించింది. కూటమి రాజకీయాల్లో కలిసి పనిచేయడం ద్వారా కొన్ని ప్రయోజనాలు కూడా ఉండవచ్చు. అందుకే పొత్తును పూర్తిగా తప్పుబట్టడం సరైన విశ్లేషణ కాదు.కానీ పొత్తు కొనసాగాలంటే జనసేన ఎదుగుదల ఆగిపోవాలా? కూటమిలో ఐక్యత ఉండాలంటే సొంత పార్టీ ప్రయోజనాల గురించి మాట్లాడకూడదా? ప్రతి ఎన్నికల సమయంలో పొత్తు గురించి చర్చ జరుగుతుంది. ప్రతి సీట్ల పంపకాల సమయంలో జనసేన వాటా గురించి ప్రశ్నలు వస్తాయి. ప్రతి సారి కార్యకర్తలు తమకు ఎందుకు తక్కువ అవకాశాలు వచ్చాయని అడుగుతారు.ఈ ప్రశ్నకు సమాధానం ఆయన ప్రసంగాల్లో కాదు, పార్టీకి దక్కుతున్న అవకాశాల్లోనూ, పెరుగుతున్న సంస్థాగత బలంలోనూ కనిపించాలి.జనసేన జెండా పవన్ కళ్యాణ్ చేతిలోనే ఉంది. కానీ ఆ జెండా కింద పార్టీ భవిష్యత్తును నిర్మించే బాధ్యత కూడా ఆయనదే. జెండా కనిపిస్తోందని సంతోషపడటం సరిపోదు.. ఆ జెండా కింద రాజకీయ బలం పెరుగుతోందా లేదా అన్నదే అసలు లెక్క!

బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోం

కోహెడ ,కోహెడ మండలం, ధర్మసాగర్‌పల్లి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన పేరుతో రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడటం సిగ్గుచేటని, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కేసులతో వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ విమర్శించారు.కోహెడ మండలం ధర్మసాగర్‌పల్లి గ్రామంలో కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఆయన పరామర్శించి, పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష కార్యకర్తలను కేసులతో భయపెట్టాలని చూడటం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. కేసులు పెట్టినంత మాత్రాన బీఆర్ఎస్ కార్యకర్తలు వెనక్కి తగ్గరని, ఉద్యమాల నుంచి పుట్టిన బీఆర్ఎస్ పార్టీని బెదిరింపులతో అణచివేయడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు.అధికారం శాశ్వతం కాదు ప్రజాసేవే అసలైన బాధ్యత. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి ఉపయోగించకూడదని హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెడుతోందని విమర్శించారు.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను రాజకీయ కక్షతో వేధించే విధంగా వ్యవహరించలేదని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని అన్నారు. అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తాం:బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోం ప్రతి కార్యకర్త వెనుక పార్టీ అండగా ఉంటుంది. బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తాం. అవసరమైతే హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తాం. సంబంధిత కేసులు చట్టబద్ధంగా కొట్టివేయబడే వరకు మా పోరాటం కొనసాగుతుంది. కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు అని సతీష్ కుమార్ స్పష్టం చేశారు.బంధువుల ద్వారా పాలన సాగించడం ప్రజాస్వామ్యానికి వి

కూటమిపై సైబర్ విషం.. పవన్ లక్ష్యంగా ముసుగు కుట్రలు !



అమరావతి,టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిని నేరుగా ఢీకొట్టే సత్తా లేక, ప్రత్యర్థి వైఎస్సార్సీపీ వర్గాలు పక్కా విష ప్రచారానికి తెరలేపాయి. కూటమి ఐక్యంగా ఉన్నంత కాలం తాము రాజకీయంగా నిలదొక్కుకోవడం కల్ల అని గ్రహించిన తాడేపల్లి వ్యూహకర్తలు.. ఎలాగైనా జనసేనను కూటమి నుంచి విడగొట్టాలనే కుట్రను పతాక స్థాయికి చేర్చారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ టికెట్ల సర్దుబాటు, స్థానిక అసంతృప్తులను ఆసరాగా చేసుకుని విద్వేషపు బీజాలు నాటడమే లక్ష్యంగా వైసీపీ సోషల్ మీడియా ముసుగు వీరులు చెలరేగిపోతున్నారు. రాజకీయ యుద్ధాన్ని సైద్ధాంతికంగా కాకుండా, ముసుగు వేసుకుని సామాజిక మాధ్యమాల వేదికగా నీచాతినీచమైన మైండ్ గేమ్‌గా మార్చేశారు.

ఏకంగా ఫేక్ వాట్సాప్ చానల్ కూడా !

ఈ విష ప్రచారంలో ప్రధానంగా జనసేనలోని సినీ అభిమానులను, గతంలో టీడీపీతో రాజకీయ విభేదాలున్న కార్యకర్తలను టార్గెట్ చేసుకుని ఎత్తుగడలు వేశారు. పవన్ కల్యాణ్ నిర్ణయాలను తప్పుబడుతూ, ఆయన పార్టీని నాశనం చేస్తున్నారని, టీడీపీకి తాకట్టు పెట్టారని ఫేక్ అకౌంట్లతో ఒక ప్రణాళికాబద్ధమైన దాడికి తెగబడ్డారు. పవన్ ఆత్మాభిమానాన్ని, నాయకత్వ పటిమను కించపరిచేలా పోస్టులు పెడుతూ జనసేన సైనికుల్లో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారు. చివరికి ఆ తెగింపు ఎంతవరకు వెళ్లిందంటే.. సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేరిటనే ఒక నకిలీ వాట్సాప్ ఛానల్ సృష్టించి, కూటమి పొత్తు నుంచి జనసేన బయటకు వచ్చేసిందంటూ ఒక కల్పిత ప్రకటనను వైరల్ చేసే దాకా వెళ్లింది. ప్రభుత్వం, డిప్యూటీ సీఎంవో నేరుగా రంగంలోకి దిగి క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వచ్చిందంటే ఈ కుట్ర ఏ స్థాయికి చేరిందో స్పష్టమవుతోంది.

జనసేనలో వైసీపీ కోవర్టులు ఉండటం వల్లనే?

ఈ వ్యవహారం ఇంతటి ప్రమాదకర స్థాయికి చేరడం వెనుక కేవలం బయటి శత్రువుల ప్రచారమే కాకుండా.. జనసేన పార్టీలోనే తిష్టవేసిన అంతర్గత కోవర్టుల పాత్ర కూడా ఉందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. పార్టీ కండువా కప్పుకుని, లోపల ఉంటూనే వైసీపీ ఎజెండాను మోసే ఈ విషపు పురుగులే ఆ ముసుగు ప్రచారానికి ఊతం ఇస్తున్నాయి. స్థానిక సంస్థల్లో తమకు ఆశించిన పదవులు దక్కలేదనో, లేక తెరవెనుక ముడుపులు అందాయనో కొందరు నేతలు సోషల్ మీడియాలో అసంతృప్తి జ్వాలలను పెంచి పోషిస్తున్నారు. బయటి దాడులను తిప్పికొట్టడం కంటే.. పార్టీ నిలువునా తొలుస్తున్న ఇలాంటి కోవర్టులను గుర్తించి, వారిపై అత్యంత కటువుగా చర్యలు తీసుకోకపోతే పార్టీ పునాదులకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

జనసేనను బయటకు తేవడమే ప్రస్తుతం వైసీపీ టార్గెట్

వైసీపీ ఆలోచన అంతా ఒక్కటే.. ఎలాగైనా కూటమిలో అగాధాన్ని సృష్టించి, పవన్ కల్యాణ్‌ను బయటకు తీసుకురావడమే. ఎందుకంటే, 2024 ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవానికి ప్రధాన కారణం ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వకుండా పవన్ కల్యాణ్ నడిపించిన రాజకీయ చతురతే. పవన్ గనుక కూటమిని వీడితే ఓట్లు చీలిపోయి, తాము మళ్లీ తేలికగా అధికారంలోకి రావచ్చన్నది వైసీపీ భ్రమ. అందుకే పవన్ వ్యక్తిత్వాన్ని హననం చేసైనా, కేడర్ మధ్య చిచ్చు పెట్టైనా సరే ఈ బంధాన్ని తెంచేందుకు ఆ పార్టీ వర్గాలు తెగించి కుట్రలు పన్నుతున్నాయి. స్థానిక ఎన్నికలను అడ్డం పెట్టుకుని కూటమి సమన్వయాన్ని దెబ్బకొట్టేందుకు సాగిస్తున్న ఈ ప్రహసనం వారి నైరాశ్యాన్ని, పలాయన వాదాన్ని తేటతెల్లం చేస్తోంది.పార్టీలోని అంతర్గత కోవర్టులను ఏరిపారేయడంతో పాటు, ఫేక్ ప్రచారాల వెనుక ఉన్న అసలు సూత్రధారులను చట్టపరంగా బోనులో నిలబెట్టేలా గట్టి చర్యలు చేపట్టాలి. అదే సమయంలో క్షేత్రస్థాయి కార్యకర్తలకు, సినీ అభిమానులకు వాస్తవ పరిస్థితులను వివరిస్తూ.. రాష్ట్ర స్థిరత్వానికి కూటమి కొనసాగింపు ఎంత కీలకమో స్పష్టమైన సందేశం ఇవ్వాల్సి ఉంది.

ఇంకా 9 రోజులే గడువు ఆ జిల్లాలో మిల్లర్లకు సివిల్ సప్లయీస్ అధికారుల హెచ్చరిక



హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ సేకరణ లక్ష్యానికి ఇంకా భారీగా బకాయిలు మిగిలి ఉన్నాయి. ఖరీఫ్ 2025–26 సీజన్‌లో పౌరసరఫరాల సంస్థకు అప్పగించాల్సిన బియ్యంలో ఇప్పటివరకు సగానికిపైగా మాత్రమే చేరగా.. మరో 40,700.846 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లుల వద్దే ఉండిపోయింది. గడువు సమీపిస్తుండటంతో మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి బకాయి బియ్యాన్ని నిర్దేశిత సమయంలోగా ప్రభుత్వానికి అప్పగించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడంలేదని తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ కార్యాలయం వివరాల ప్రకారం.. ఖరీఫ్ 2025–26 సీజన్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 39 రైస్ మిల్లులకు 1,46,309.920 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించారు. ఈ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి మొత్తం 98,027.646 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం అప్పగించాల్సి ఉంది. అయితే.. ఇప్పటివరకు 57,326.600 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే పౌరసరఫరాల సంస్థకు చేరింది. దీంతో నిర్దేశిత లక్ష్యంలో ఇంకా 40,700.846 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. అంటే మొత్తం డెలివరీ చేయాల్సిన పరిమాణంలో దాదాపు 41.5 శాతం బియ్యం ఇంకా బకాయిగానే ఉంది. ఇప్పటివరకు సుమారు 58.5 శాతం మేర సేకరణ పూర్తయినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

దగ్గర పడుతున్న గడువు..

సీఎంఆర్ బియ్యం అప్పగించేందుకు 2026 అక్టోబర్ 31ను తుది గడువుగా అధికారులు నిర్ణయించారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో మిగిలిన భారీ పరిమాణాన్ని మిల్లులు సకాలంలో పూర్తి చేయడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. అయితే.. ఈ మేరకు మిల్లర్ల మీద ఒత్తిడి తెస్తున్నప్పటికీ రికవరీ కావడం లేదని తెలుస్తోంది. మిల్లింగ్, రవాణా, బియ్యం అప్పగింత ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు ఇప్పటికే సూచనలు జారీ చేశారు. మరోవైపు నిర్ణీత పరిమాణంలో బియ్యం అప్పగించకుండా కొరత చూపించినా మిల్లర్లకు మినహాయింపు ఉండదని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వానికి అందాల్సిన సీఎంఆర్‌లో షార్టేజ్ ఏర్పడితే.. ఆ మేరకు నష్టపరిహారాన్ని సంబంధిత మిల్లర్‌కు కార్పొరేషన్ నుంచి చెల్లించాల్సిన ఇతర బిల్లులు, ఖాతాల నుంచి సర్దుబాటు (అడ్జస్ట్) చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

మిల్లర్లపై మరింత ఒత్తిడి

ఇప్పటికే జిల్లాలోని 39 మిల్లులకు భారీ మొత్తంలో ధాన్యం కేటాయించగా, అందుకు అనుగుణంగా సీఎంఆర్ బియ్యం ప్రభుత్వ గోదాములకు చేరాల్సి ఉంది. అయితే.. ఇప్పటివరకు వచ్చిన పరిమాణంతో పోలిస్తే ఇంకా 40 వేల టన్నులకు పైగా బియ్యం అందాల్సి ఉండటంతో అధికారులు మరింత సీరియస్‌గా తీసుకున్నారు. తుది గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయకపోతే ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం సేకరణపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గడువు ముగిసేలోపు మిగిలిన 40,700.846 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని తప్పనిసరిగా అప్పగించాల్సిందేనని అధికారులు తేల్చిచెప్పారు. మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వానికి రావాల్సిన బియ్యాన్ని సకాలంలో గోదాములకు తరలించాలని జిల్లా పౌరసరఫరాల యంత్రాంగం ఆదేశించింది.

అక్టోబర్ 27-30 మధ్య తీవ్ర తుఫాను హెచ్చరిక

విజయవాడ ,తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు వాతావరణ శాఖ సూచనలు జారీ చేసింది.థాయ్‌లాండ్ గల్ఫ్, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఆవర్తనానికి అనుబంధంగా ఈ వ్యవస్థ బలపడుతోంది. ఇది ఉత్తర అండమాన్ సముద్రం వైపు కదిలి, ఆ తర్వాత పశ్చిమ–వాయవ్య దిశగా ప్రయాణించనుంది. దీని గమనం, తీవ్రతను బట్టి రెండు రాష్ట్రాలపై వాతావరణ ప్రభావం ఆధారపడి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో వర్ష హెచ్చరిక

ఆంధ్రప్రదేశ్‌పై ఈ అల్పపీడన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ అమరావతి కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు తదుపరి సూచనలు అందే వరకు వేటకు వెళ్లవద్దని సూచించింది.

తెలంగాణలో తేలికపాటి జల్లులు

ఇక తెలంగాణలోనూ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం బలపడే కొద్దీ ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడటం వంటివి చేయరాదని, ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు కోత కోసిన పంటలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ సమాచారాన్ని అనుసరించాలని అధికారులు కోరుతున్నారు.మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ అల్పపీడన పరిణామాలు రానున్న రోజుల్లో బలపడి



తీవ్రమైన తుఫానుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. అక్టోబర్ 27 నుంచి 30వ తేదీల మధ్య ఈ తుఫాను తీవ్ర రూపం దాల్చి కోస్తాంధ్ర , ఒడిశా తీరాల వైపు దూసుకొచ్చే సూచనలు స్పష్టమవుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర కోస్తాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు ఒడిశా దక్షిణ తీరప్రాంతాలు ఈ తుఫాను తీవ్ర ప్రభావానికి గురయ్యే అవకాశం ఉండటంతో తీరప్రాంత యంత్రాంగాన్ని ముందస్తుగా అప్రమత్తం చేశారుఈ ముప్పు దృష్ట్యా అక్టోబర్ 27 నుంచి 30 మధ్య కోస్తాంధ్ర ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 60 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో, పీక్ సమయంలో అంతకంటే ఎక్కువ వేగంతో ఈదురు గాలులు వీచే వీలుంది. తీరప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్స్ సమాయత్తమవుతున్నాయి. వేటకు వెళ్లిన మత్స్యకారులను వెంటనే తీరానికి తిరిగి రావాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారుఈ తుఫాను ప్రభావం పొరుగున ఉన్న తెలంగాణపై ఎంతవరకు ఉంటుంది? అనే దానిపై వాతావరణ శాఖ స్పష్టతనిచ్చింది.

మోతె భారతి ఇండస్ట్రీస్‌లో విజిలెన్స్ దాడులు..



సిద్దిపేట : సిద్దిపేట జిల్లాలోని అక్బర్‌పేట–భూంపల్లి మండలం మోతె గ్రామ శివారులో ఉన్న భారతి ఇండస్ట్రీస్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాలోని ఓ రైస్ మిల్లులో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం పట్టుబడిన వ్యవహారంలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. పరిశ్రమలో భౌతిక తనిఖీలు నిర్వహించిన అధికారులు మొత్తం 42,784 క్వింటాళ్ల బియ్యం, ధాన్యాన్ని సీజ్ చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అజయ్‌బాబు వెల్లడించారు.

రంగారెడ్డి జిల్లాలో పీడీఎస్ బియ్యం గుర్తింపు

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లి గ్రామ పరిధిలోని న్యూ బన్సల్ రైస్ ఇండస్ట్రీస్‌లో పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయాల్సిన బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచుతున్నారనే ఆరోపణలపై సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 50 కిలోల బరువున్న 677 బియ్యం బస్తాలు, 25 కిలోల బరువున్న 101 బియ్యం బస్తాలను గుర్తించారు. అక్కడికి వచ్చిన టీఎస్-03-యూబీ-3399 నంబరు గల టాటా లారీలో మరో 51 బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు.బియ్యం నమూనాలను సేకరించి సాంకేతిక అధికారులతో పరీక్షించగా, వాటిలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్ఆర్‌కే) ఉన్నట్లు నిర్ధారణ అయిందని సంబంధిత ఫిర్యాదులో పేర్కొన్నారు. న్యూ బన్సల్ రైస్ ఇండస్ట్రీస్ యజమాని గీతేష్ బన్సల్ ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, సిద్దిపేట జిల్లా మోతె గ్రామ శివారులోని భారతి ఇండస్ట్రీస్ నుంచి బియ్యం కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు అధికారులు పేర్కొన్నారు.

పంచనామా తయారు.. ఉన్నతాధికారులకు నివేదిక

ఈ నేపథ్యంలో మోతె గ్రామ శివారులోని భారతి ఇండస్ట్రీస్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అజయ్‌బాబు, స్థానిక సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ అధికారులు కలిసి తనిఖీలు చేపట్టారు. పరిశ్రమలోని బియ్యం, ధాన్యం నిల్వలను భౌతికంగా పరిశీలించి, బస్తాలకు సంబంధించి పంచనామా తయారు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

విచారణలో తేలాల్సిన అక్రమ రవాణా వ్యవహారం

పీడీఎస్ బియ్యం సరఫరా, కొనుగోళ్లకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. తెలంగాణ పీడీఎస్ రైస్ (కంట్రోల్) ఆర్డర్--2016లోని క్లాజ్ 17(ఇ) ఉల్లంఘన జరిగిందనే ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల పాత్రను విచారించాలని సివిల్ సప్లైస్ శాఖ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో న్యూ బన్సల్ రైస్ ఇండస్ట్రీస్ యజమాని గీతేష్ బన్సల్, బియ్యం సరఫరాకు సంబంధించి పేర్కొన్న శ్రీరామ్ లోహియా, భారతి ఇండస్ట్రీస్ యజమాని కపర్తి నాగభూషణం పాత్రపై విచారణ జరగాల్సి ఉంది.రంగారెడ్డి జిల్లాలో పీడీఎస్ బియ్యం పట్టుబడిన ఘటనపై అక్కడి అధికారులు విచారణ కొనసాగిస్తున్నారని సీఐ అజయ్‌బాబు తెలిపారు. ఆ విచారణలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రస్తుతం భారతి ఇండస్ట్రీస్‌లో నిర్వహించిన తనిఖీలకు సంబంధించి పంచనామా, భౌతిక ధ్రువీకరణ వివరాలను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు వెల్లడించారు.

అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

సికింద్రాబాద్,త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా బీఆర్ఎస్ పార్టీ నాయకులు విస్తృత అవగాహన కల్పించాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ వరకు గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. కాలనీలు, బస్తీలతో సంబంధం లేకుండా అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదుకు ప్రోత్సహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ బాధ్యతగా వ్యవహరించి నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించిన పార్టీ నాయకులను తలసాని అభినందించారు.

మిషన్ తెలంగాణకు కమలదళం కిక్ స్టార్ట్ !



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ తన అసలైన దూకుడును ప్రదర్శించేందుకు సిద్ధమైంది. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం మాత్రమే ఉండటంతో.. ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పాగా వేయడమే లక్ష్యంగా బీజేపీ అగ్రనాయకత్వం సరికొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్‌లో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిసెంబర్‌లో తెలంగాణలో సుడిగాలి పర్యటనలు చేపట్టేందుకు షెడ్యూల్ ఖరారైంది. ఢిల్లీ పెద్దలు ఏకకాలంలో వరుస పర్యటనలతో రాష్ట్రంలో అడుగుపెట్టనుండటం కాషాయ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

బూత్ స్థాయిలో పార్టీపై సమీక్ష

ఈ వ్యూహాత్మక పర్యటనల్లో భాగంగా అమిత్ షా హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పరిధిలోని బూత్ కమిటీ సమ్మేళనాల్లో నేరుగా పాల్గొననున్నారు. బీజేపీ సిద్ధాంతంలో బూత్ స్థాయి బలమే ఎన్నికల విజయాలకు అసలైన పునాది. కేవలం భారీ బహిరంగ సభలకే పరిమితం కాకుండా నేరుగా పోలింగ్ బూత్ కార్యకర్తలతో అమిత్ షా భేటీ కానున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 8 ఎంపీ స్థానాలు గెలుచుకుని తామే కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయమని నిరూపించుకున్న బీజేపీ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఓటు బ్యాంకును మరింత పటిష్టం చేసుకుంటూ గ్రౌండ్ లెవల్ నెట్‌వర్క్‌ను పూర్తిస్థాయిలో యాక్టివేట్ చేసేందుకు ఈ సమ్మేళనాలను వేదికగా ఎంచుకుంది.

ప్రత్యామ్నాయ పార్టీగా ఎదిగే ప్రయత్నం

రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా అసంతృప్తిని, మరోవైపు బీఆర్ఎస్ ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పూర్తిగా తమకు అనుకూలంగా మలచుకోవడమే బీజేపీ ప్రథమ లక్ష్యం. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న హామీలు, రుణమాఫీ, గ్యారెంటీల వైఫల్యాలను ఎండగడుతూ.. ప్రజల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకతను ఒడిసిపట్టేందుకు ఢిల్లీ నాయకత్వం నేరుగా కార్యాచరణను రూపొందిస్తోంది. డిసెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ద్వారా కేంద్ర నిధులు, అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలతో పాటు డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి భావోద్వేగపూరిత వాతావరణాన్ని సృష్టించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

మోదీ, షా పర్యటనల తర్వాత బీజేపీ దూకుడు

రెండేళ్ల తర్వాత జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ఇప్పటి నుంచే పునాది రాళ్లు వేస్తున్నట్లు భావిస్తున్నారు. నామమాత్రపు విమర్శలతో సరిపెట్టకుండా, ఢిల్లీ అగ్రద్వయం నేరుగా రంగంలోకి దిగి బూత్ స్థాయి సైనికులకు దిశానిర్దేశం చేయడం ద్వారా తమ అసలైన గేమ్‌ప్లాన్‌కు శ్రీకారం చుట్టింది. ఎన్నికల నాటికి ఎలాంటి పొత్తులు, ఆందోళనలు లేకుండా స్వశక్తితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే అంతిమ లక్ష్యంగా కమలదళం పక్కా ప్లాన్లు వేయడం ఖాయమని అనుకోవచ్చు.

రాయలసీమ రాజకీయాలకు 'అలయ్ బలయ్' వ్యాక్సిన్ కావాలి..



హైదరాబాద్,రాజకీయాల్లో దప్పు కొట్టడం వేరు.. దప్పు చప్పుడుకు స్టెప్పులేస్తూ ప్రత్యర్థులను కౌగిలించుకోవడం వేరు.. ఈ విద్యలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హనుమంతరావు (వీహెచ్) గారికి మాస్టర్స్ డిగ్రీ ఉందంటే అతిశయోక్తి కాదు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రతీ ఏటా ఎంతో ఘనంగా నిర్వహించే 'అలాయ్ బలయ్' కార్యక్రమంలో వీహెచ్ మార్క్ సందడి మరోసారి సభలో జోష్ నింపింది.తెలంగాణ రాజకీయాలు ఎలా ఉంటాయో మనందరికీ తెలిసిందే. టీవీ స్టూడియోల్లో.. సభల్లో నాయకులు తిట్టుకున్నా.. కొట్టుకున్నంత పని చేసినా.. బయటకు రాగానే అలాయ్ బలయ్ అని కౌగిలించుకుని గ్లాసు కలుపుతారు. కానీ మన పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా రాయలసీమ రాజకీయాల ముచ్చట వేరు.. ఇదే విషయాన్ని వీహెచ్ తనదైన సెటైరికల్ స్టైల్‌లో దత్తన్న ముందు వెళ్లబోసుకున్నారు.

"కడప, కర్నూలులో ఒకసారి గొడవ పడితే చచ్చినా కలవరు"

వీహెచ్ వేదికపై మైక్ అందుకుంటే నవ్వులకు కొదవ ఉండదు. "మా తెలంగాణలో ఎంత కొట్టుకున్నా, మైకులు విరగ్గొట్టుకున్నా చివరికి అందరం ఒకటై కలుస్తాం. కానీ కడప, కర్నూలు, అనంతపురం, ఒంగోలు ప్రాంతాల్లో అలా కాదు బాబోయ్.. ఒక్కసారి తేడా వచ్చిందో.. ఎన్నేళ్లయినా.. చచ్చినా కలవరు. అంతా పొడుచుకునుడు, చంపుకునుడే" అంటూ వీహెచ్ విసిరిన పంచ్‌లకు వేదికపై ఉన్న నాయకులతో పాటు జనాలు కూడా పొట్టచెక్కలయ్యేలా నవ్వుకున్నారు. ఆంధ్రలో ఎన్నికలొస్తే నామినేషన్లు కూడా వేయనివ్వని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేసిన వీహెచ్.. "ఏం మనుషులండీ నాయనా.. అంత పగలూ ప్రతీకారాలు ఎందుకు?" అని ప్రశ్నించారు.

దత్తన్నా.. వచ్చే ఏడాది సీమకు పోదాం!

అందుకే ఈ రాయలసీమ, కోస్తా నాయకుల మధ్య ఉన్న ఈ 'ఫ్యాక్షన్ పగలను' కరిగించేందుకు ఒకే ఒక్క పరిష్కారం ఉందని వీహెచ్ ఒక మాస్టర్ ప్లాన్ ప్రతిపాదించారు. "అలయ్ బలయ్ అంటేనే దత్తన్న.. దత్తన్న అంటేనే అలయ్ బలయ్. అందుకే దత్తన్నా వచ్చే ఏడాది ఈ వేడుకను పక్క రాష్ట్రంలో పెట్టు. అక్కడ ఉన్న నాయకులకు అలయ్ బలయ్ ఇచ్చి వారిని మార్చే బాధ్యత మనం తీసుకుందాం" అని దత్తాత్రేయకు బంపర్ ఆఫర్ ఇచ్చారు.రాజకీయ వైరుధ్యాలను పక్కనబెట్టి అందరినీ ఒకే వేదికపైకి తెచ్చే తెలంగాణ సంస్కృతిని ఆంధ్రాకి కూడా ఎగుమతి చేయాలని వీహెచ్ కోరారు. ప్రతీ ఏటా దప్పు దరువులకు డ్యాన్స్ చేసే వీహెచ్.. ఈసారి కూడా ఇతర పార్టీల నాయకులను ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ అందరినీ అలరించారు. 'సీమ పగలకు తెలంగాణ అలయ్ బలయ్ ఒక మంచి ఔషధం' అని వీహెచ్ తేల్చేశారు. మరి దత్తన్న వచ్చే ఏడాది బస్సు ఎక్కి రాయలసీమకు బయలుదేరుతారో లేదో చూడాలి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140